
సాక్షి
ఒడిశా
గురువారం । 16 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 4,07,034లు, బంగారం 1 గ్రాము 700 మిల్లీ గ్రాములు వెండి 10 గ్రాముల 500 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఎక్కడివక్కడే..!

- ప్రైవేట్ డ్రైవర్ల బంద్ విజయవంతం
- స్తంభించిన రవాణా వ్యవస్థ

- 8లో



ముగిసిన అగ్ని గంగమ్మ యాత్ర

- 8లో

న్యూస్‌రీల్

81 కిలోల గంజాయి స్వాధీనం



సీజ్ చేసిన గంజాయి, వ్యాన్ చూపిస్తున్న పోలీసులు

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా పోలీసులు సరిహద్దుల్లో ఒక వ్యాన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని బుధవారం పట్టుకున్నారు. ఐఐసీ అధికారి బాబు శంకర్ సాహు తెలిపిన వివరాల మేరకు.. గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో బుదనాడ జంక్షన్‌లో బల్లిగుడా పోలీసులు దాడులు నిర్వహించి సుమారు 81 కిలోల గంజాయి సీజ్ చేశారు. పోలీసులను చూసి నిందితులు తప్పించుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

శ్రీమందిరానికి పోటెత్తిన భక్తులు

- పశ్చిమ ద్వారం వద్ద తోపులాట



దర్శనం కోసం భక్తుల తోపులాట

భువనేశ్వర్: సంక్రాంతి తిథి పురస్కరించుకొని బుధవారం శ్రీక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. జగన్నాథుని దర్శనం కోసం పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో శ్రీమందిరం పశ్చిమ ద్వారం ప్రాంగణంలో తోపులాట చోటుచేసుకుంది. రద్దీ నియంత్రణలో అనుబంధ యంత్రాంగం విఫలమైందని భక్తుల నుంచి విమర్శలు వచ్చాయి. రద్దీ పెరగడంతో శ్రీమందిరం తూర్పు, పశ్చిమ ద్వారాల గుండా ప్రవేశానికి భక్తులకు అనుమతించారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో రద్దీ విపరీతం కావడంతో పశ్చిమ ద్వారం ప్రాంగణంలో తోపులాట చోటుచేసుకుని మహిళ నేల మీద పడింది. కాసేపు ఈ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అయితే ఎటువంటి తొక్కిసలాట జరగలేదని పూరి జిల్లా పోలీసు సూపరింటిండెంట్ డాక్టర్ కె.వి. సింగ్ తెలిపారు. పుకార్లను నమ్మవద్దన్నారు. రద్దీ నియంత్రణ కోసం తగినంత బలగాలను వినియోగించినట్లు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జనరల్ మేనేజర్ మనోజ్ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ జయపురం రైల్వేస్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జయపురం జన కల్యాణ మంచ్ ప్రతినిధులు ఆయనను కలిసి స్టేషన్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. 26వ జాతీయ రహదారి సమీపంలోని పాత గూడ్సు షెడ్, ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వద్ద అమృత భారత్ పథకంలో కొత్త స్టేషన్ భవనాలు నిర్మించాలని కోరారు. రాత్రులు నడిచే కిరండూల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను భువనేశ్వర్ వరకు నడపాలని, హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలులో భోగీలు పెంచాలని విన్నవించారు. జయపురం-నవరంగపూర్, జయపురం-మల్కన్‌గిరి రైలు మార్గాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం డీఆర్ఎం అనూప్ శతపతి మాట్లాడుతూ.. జయపురం రైల్వేస్టేషన్‌లో కొత్త భవనాల నిర్మాణం పరిశీలనలో ఉందని, అదనపు భోగీల విషయంలో కొంత సమయం అవసరమన్నారు. జయపురం-మల్కన్‌గిరి, జయపురం- నవరంగపూర్ రైలు మార్గాల కోసం భూసేకరణ కేవలం 15 శాతం పూర్తయ్యిందని, భూసేకరణ పూర్తయితే పనులు చేపడతామని తెలిపారు. రైల్వే అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో బాలారాయ్, రాజేంద్ర గౌడ, చంద్రకాంత తుషార్, మనోజ్ దాస్, సహదేవ్ పట్నాయక్, బులుదేవ్ శర్మ, ప్రత్యూష్ పట్నాయక్ ఉన్నారు.

ప్రయాణ పాట్లు





ఒడిశా డ్రైవర్ చాలక్ మహా సంఘం పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌తో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు బస్సులు, వాహనాలు నిలిచిపోయాయి. బరంపురంలో వందలాది సంఖ్యలో ప్రైవేటు బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- బరంపురం

పెరగనున్న ఎమ్మెల్యేల జీతభత్యాలు

- బిల్లు ప్రవేశపెట్టాలని కోరిన సభ్యులు
- సభ్యుల అభ్యర్థనకు స్పీకర్ బిక్రమ్ కేశరీ అంగీకారం
- కమిటీ నివేదిక మేరకు పెంపు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ సభ్యుల జీతభత్యాల పెంపుపై పార్టీలకు అతీతంగా అన్ని పక్షాల సభ్యులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన సమావేశాల శూన్య గంటలో ఈ అంశాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ శాసనసభ నాయకుడు నరసింహ మిశ్రా ప్రస్తావించారు. ఆయనతో అధికార, విపక్ష సభ్యులు ఏకీభవించారు. సిట్టింగ్, మాజీ ఎమ్మెల్యేల జీతాలు, పింఛన్ పెంచేందుకు అనుబంధ బిల్లును సభలో ప్రవేశపెట్టాలని స్పీకర్‌కు అభ్యర్థించారు. సభ్యుల అభ్యర్థనపై స్పీకర్ బిక్రమ్ కేశరీ అరూఖ్ సానుకూలంగా స్పందించారు. బిల్లుని సభలో ప్రవేశపెట్టాలని మంత్రి నిరంజన్ పూజారిని ఆదేశించారు.

పరిగణలోకి నివేదిక

ప్రస్తుత ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల జీతభత్యాలు, పింఛన్ పెంపు ప్రతిపాదనపై బీజేడీ ఎమ్మెల్యే అమర్‌ప్రసాద్ శత్పతి నేతృత్వంలోని కమిటీ సమర్పించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని నరసింహ మిశ్రా పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో దైనందిన జీవన వ్యయం పెరిగిందన్నారు. ఎమ్మెల్యేల వేతనం రూ.1 లక్ష నుంచి రూ.2.5 లక్షలకు



శాసనసభ సమావేశాల్లో స్పీకర్ బిక్రమ కేశరి అరూఖ్

పెంచాలని జీతభత్యాల కమిటీకి ప్రతిపాదించారు. దీనిలో రూ.35,000 జీతం, రూ. 5,000 అలవెన్సులుగా పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనని కమిటీ సిఫార్సు చేసిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సభ జరుగుతున్నప్పుడు చెల్లించే రూ.1,500 రోజువారీ భత్యం, ప్రయాణ రీయింబర్స్‌మెంట్ మినహాయింపుతో జీతాల పెంపు ప్రతిపాదించినట్లు వివరించారు. నియోజకవర్గం కార్యకలాపాల్లో సహాయకుడిని (అసిస్టెంట్) నియమించేందుకు రూ.5,000 ఇస్తున్నా సరిపోవడం లేదన్నారు. ఈ విషయంలో బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రభుత్వానికి రూలింగ్ ఇవ్వాలని సభ్యులందరి తరపున సీఎల్‌పి నరసింహ మిశ్రా స్పీకర్‌ను అభ్యర్థించారు. వీలైనంత త్వరగా బిల్లును ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు మద్దతు ఇస్తున్నట్లు ప్రతిపక్ష విప్ మోహన్ మాఝీ తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చివరగా 2017 సంవత్సరంలో ఎమ్మెల్యేలు, మంత్రుల వేతనాలను 50 శాతానికి పైగా పెంచింది.

ఆదివాసీలకు అవగాహన



మాట్లాడుతున్న న్యాయాధికారి విఘ్నేశ్వరరావు



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

జయపురం: ఆదివాసీ, హరిజన సామాజిక వర్గాలపై జరుగుతున్న దారుణాలను అరికట్టేందుకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించేందుకు జయపురం సమితిలోని జి.మాలిగుడ గ్రామంలో న్యాయ సేవాధికరణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు జడ్జి ఇ.విఘ్నేశ్వరరావు మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న అత్యాచారాలు అరికట్టి, బాధితులకు రక్షణ కల్పించేందుకు చట్టాలు చేయబడ్డాయన్నారు. కేసులను విచారించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితులు ప్రభుత్వం సమకూర్చే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికరణ కార్యదర్శి సుమన్ జెన, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదర్శకుమార్ బెహర తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీల కర్మాగారంపై దాడి

- ఇద్దరు నిందితులు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీలు

బరంపురం: గంజాం జిల్లా జగన్నాథప్రసాద్ పోలీసులు నాటు తుపాకీల కర్మాగారంపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఐఐసీ అధికారి దిలీప్ కుమార్ స్వాయి తెలియజేశారు. నయాగడ-గంజాం జిల్లాల సరిహద్దు జయరామ్‌పూర్ గ్రామంలోని మోహన్ మాలిక్ ఇంటిపై దాడిచేసి 5 నకిలీ నాటు తుపాకీలతో పలు యంత్రాలు, కర్రలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారిలో మోహన్ మాలిక్, సుశాంత్ నాయకులు ఉన్నట్లు వెల్లడించారు.

ఆందోళనలపై చర్చ

భువనేశ్వర్: రాష్ట్రంలో ఉపాధ్యాయులు, డ్రైవర్ల ఆందోళన అంశాన్ని కాంగ్రెస్ శాసనసభ నాయకుడు నర్సింహ మిశ్రా అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రభుత్వం ఆందోళనకారుల వర్గంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అయితే డ్రైవర్ల సమాఖ్య స్టీరింగ్ బహిష్కరణ సమ్మెకు సంబంధించి శాఖాపరంగా ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు వాణిజ్య, రవాణా శాఖ మంత్రి టుకుని సాహు తెలిపారు. వారి డిమాండ్లపై ముఖ్యమంత్రి సానుకూలంగా ఆలోచిస్తున్నారన్నారు. మరోవైపు సమ్మె విరమణకు అభ్యర్థించినట్లు తెలిపారు. అన్ని సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించబడతాయని రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి అన్నారు. డ్రైవర్ల సంఘం డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలియజేశారు. ఆందోళనల కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జయపురం: వినియోగదారులకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ ప్రఫుల్ల కుమార్ పండ అన్నారు. బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి అధ్యక్షతన పట్టణంలో సీవా ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు అన్యాయం జరిగితే కంజ్యూమర్ ఫోరం దృష్టికి తీసుకొచ్చి న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు ఎలా మోసగించబడుతున్నారు, ఏవిధంగా ఫిర్యాదు చేయాలి అనే అంశాలను వివరించారు.

అనంతరం అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషన్ కొరాపుట్ జిల్లా సభ్యులు సల్మ భాను, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు రాజపాల్ ఖురాణ, లీగల్ మెటియోరాలజీ డిప్యూటీ కంట్రోలర్ సత్యజిత్ బిశ్వాల్, హెచ్ఎం బి.సుజాత, న్యాయవాది కూర్మారావు, ఏసీఎస్‌వో సుశీల్ కుమార్ జెన తదితరులు పాల్గొన్నారు.



జయపురం: మాట్లాడుతున్న ప్రఫుల్ల కుమార్ పండ



జయపురం: కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

హక్కులు తెలుసుకోవాలి

పర్లాకిమిడి: వినియోగదారుడు తనకున్న హక్కులను తెలుసుకోవాలని వినియోగదారుల హక్కుల కమిటీ జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథ్ అన్నారు. స్థానిక రణదేవి గ్రామంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. నిత్యావసర వస్తువులు, కరెంటు, తాగునీరు, మున్సిపల్ ట్యాక్సులపై వినియోగదారులు గళమెత్తాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు తనూజా శతపథి, రాసూరుకు చెందిన బి.చలపతిరావు, బంగారయ్య, గోపాలరావు, లింగరాజు, కామేష్, అప్పన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఉగాది ఉత్సవాలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నెక్కంటి

- ప్రారంభించిన మాజీ ఎంపీ నెక్కంటి
- ముగ్గుల పోటీలకు విశేష స్పందన

రాయగడ: స్థానిక తేజస్విని హోటల్ ఎదురుగా ఉన్న మైదానంలో ఉగాది ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ప్రారంభించారు. దీనిలో భాగంగా నిర్వహించిన మెహందీ, ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ.. ఈ ఏడాది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు భాష, సంస్కృతికి అద్దం పట్టేవిధంగా ఉత్సవాలను నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పోటీల్లో విజేతలు

ఉత్సవాల్లో భాగంగా మెహందీ పోటీల్లో 140 మంది, ముగ్గుల పోటీల్లో 285 మంది మహిళలు పాల్గొన్నారు. మెహందీ పోటీల్లో పి.వర్షిత ప్రథమ బహుమతి, ఎస్.పూర్ణిమ ద్వితీయ బహుమతి, రిహాన్ కుటాన్‌లు తృతీయ బహుమతి పొందగా, అశ్విని బెబర్తా, వి.చాందినిలు ప్రోత్సాహక బహుమతులు గెలిచారు. అదేవిధంగా రంగవల్లుల పోటీల్లో 285 మంది పాల్గొనగా రెండు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగంలో సుస్మిత చక్రవర్తి, సుజిత్ ఘోష, హాళిబా కాంజన్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ విభాగంలో కె.శాంతిలత, బి.తులసీలు ప్రోత్సాహక బహుమతులు పొందారు. అదేవిధంగా రంగవల్లుల ద్వితీయ విభాగంలో సీహెచ్ గౌతమి, రంజిత బౌరి, నమిత బిసాయిలు విజేతలుగా నిలవగా, ఆర్.గౌరిశ్వరి, ఇప్పిలి వైజయంతిలు ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. పోటీలకు ఎద్దు శైలజ, పింకి రౌథా, బి.శ్రీదేవి, కృష్ణప్రియ, పద్మాలయ మిశ్రాలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులను ఉగాది పర్వదినం రోజు అందజేస్తామని నిర్వాహకులు ఇప్పిలి సన్యాసి రాజు, పతివాడ వనిత, రాంబాబు తుంబటి, ముంజేటి గంగాధర్, కరుణా శంకర్, బి.తిరుపతి తదితరులు తెలియజేశారు.



మెహందీ పోటీల్లో పాల్గొన్న మహిళలు



మొదటి బహుమతి పొందిన ముగ్గు



ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు

నేడు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు

ఉగాది ఉత్సవాల్లో భాగంగా 15 ఏళ్లలోపు బాలబాలికలకు గురువారం ఫ్యాన్సీ డ్రస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.



నిర్వాహకులతో మెహందీ పోటీల విజేతలు



నిర్వాహకులతో ముగ్గుల పోటీల విజేతలు

క్లుప్తంగా

యోగా పీజీ డిప్లమోలో ప్రవేశాల గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో యోగా పీజీ డిప్లమోలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. యోగా, ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మార్చి 15తో దరఖాస్తు స్వీకరణ గడువు ముగియగా, ఏప్రిల్ 3 వరకు పెంచినట్లు పేర్కొన్నారు. డిగ్రీ విద్యార్హత ఉండాలని తెలిపారు. రూ.10 వేలు ట్యూషన్ ఫీజుకాగా, దరఖాస్తుకు రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు డీఆర్‌బీఆర్‌ఏయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌ను గానీ, యోగా కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వి.అరుణ (94906 77790)ను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నలుగురు జూదరులపై కేసు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్ సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి రూ.18,200 స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు.

డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని అఫిలియేషన్ కళాశాలల డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడో సెమిస్టర్‌కు సంబంధించి రెగ్యులర్, సప్లిమెంటరీ, ఐదో సెమిస్టర్‌కు సంబంధించి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 29 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఐదో సెమిస్టర్ 20 పరీక్ష కేంద్రాల్లో ఉదయం పూట, మూడో సెమిస్టర్ 66 పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం నిర్వహిస్తున్నారు. ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు.

మరో ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం బీసీ బాలుర వసతిగృహంలో రెండు రోజులుగా 41 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందిన తెలిసిందే. వీరిలో మంగళవారం 32 మంది డిశ్చార్జ్ అయి వసతి గృహానికి వెళ్లారు. మిగిలిన 9 మంది బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఇంతలోనే మరో ఐదుగురు విద్యార్థులు వాంతులు, విరోచనాలతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి అనూరాధ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీతులసి సమీక్షించారు. వసతి గృహంలో క్లోరినేషన్ చర్యలు చేపట్టి విద్యార్థులకు తేలికపాటి ఆహారం, వేడి నీటి సదుపాయం కల్పించాలని వార్డెన్ టి.అప్పారావును ఆదేశించారు.

ఆరా తీసిన సబ్ కలెక్టర్ ...

టెక్కలి: పోలవరం బీసీ బాలుర వసతి గృహాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం రాత్రి పరిశీలించారు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయనతో పాటు తహసీల్దారు కిషోర్ ఉన్నారు. టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా వసతి గృహాన్ని సందర్శించారు. వార్డెన్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పలాస మండలం రెంటికోటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నందపూరి లబ్బో(50) స్పీడ్ బ్రేకర్ వద్ద రోడ్డు దాటుతుండగా పలాస ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ గమనించక ఢీకొట్టాడు. తల మీదుగా బస్సు వెళ్లడంతో లబ్బో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భార్య లొక్కిమి, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మలేషియా నుంచి స్వగ్రామానికి విజయకుమార్ మృతదేహం

నరసన్నపేట: ఉపాధి కోసం మలేషియా వెళ్లి ఆత్మహత్య చేసుకున్న బడ్డ విజయకుమార్ మృతదేహం ఎట్టకేలకు బుధవారం సాయంత్రం స్వగ్రామం బాలసీమకు చేరింది. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆరు నెలల క్రితం మలేషియా వెళ్లిన విజయకుమార్ ఈ నెల 3న అక్కడ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి తల్లిదండ్రులు కొండాలమ్మ, వెంకటరమణలు కుమారుడు చివరి చూపు కోసం ఎదురు చూశారు. పేదరికం కావడంతో మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న స్నేహితులు విరాళాలు సేకరించి మృతదేహాన్ని రప్పించారు. మలేషియాలో ఉన్న తెలుగు వారు కూడా కొంత వరకూ సహకరించారని తండ్రి వెంకటమణ తెలిపారు. హైదరాబాద్‌కు బుధవారం వేకువజామున విమానంలో మృత దేహం రాగా, అక్కడి నుంచి సాయంత్రం 4 గంటలకు స్వగ్రామం వచ్చింది. కుమారుడి మృతదేహం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఎక్కడివక్కడే..!


భువనేశ్వర్: జాతీయ రహదారిపై నిలిచిపోయిన లారీలు


బరంపురం: ఫస్ట్‌గేట్ జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

- ప్రైవేట్ డ్రైవర్ల బంద్ విజయవంతం
- స్తంభించిన రవాణా వ్యవస్థ


పర్లాకిమిడి: కొత్త బస్టాండ్‌లో ఒడిశా డ్రైవర్స్ సంఘం ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్న దృశ్యం

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డ్రైవర్ల ఐక్య మహా సంఘం బుధవారం ఉదయం నుంచి నిరవధిక స్టీరింగ్ విరమణ ఆందోళన ప్రారంభించింది. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వేలాది మంది డ్రైవర్లు రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలు చేపట్టారు. ఎక్కడికక్కడ రోడ్డు మీద వాహనాల రవాణా స్తంభించిపోయింది. నిత్యావసర సేవలు మినహా వాణిజ్య వాహనాలు రోడ్లపై తిరగలేదు. సమ్మె కారణంగా బస్సులు, ట్రక్కులు, ట్యాక్సీలు నిలిచిపోవడంతో ప్రజా రవాణాపై తీవ్ర ప్రభావం పడింది. పనిచేసే డ్రైవర్లకు ప్రమాద బీమా అంటే డ్రైవింగ్‌లో ప్రమాదం జరిగితే రూ.20 లక్షలు, అంగ వైకల్యం ఏర్పడితే రూ.10 లక్షలు, క్షతగాత్రులకు వైద్యం కోసం రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


బరంపురం: కొత్త బస్టాండ్ ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న ప్రైవేట్ బస్సుల కర్మచారి సంఘం


బరంపురం: ఆందోళన చేస్తున్న డ్రైవర్లు


జయపురం: వాహనాలను అడ్డుకుంటున్న ఆందోళనకారులు


జయపురం: రాస్తారోకో నిర్వహిస్తున్న డ్రైవర్లు


జయపురం: నిరసన తెలుపుతున్న డ్రైవర్లు


మల్కన్‌గిరి: బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు

• శుభాకాంక్షలు



నాటు నాటు పాటకు ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు సాధించిన ఆర్ఆర్ఆర్ చిత్ర యూనిట్‌కు అంతర్జాతీయ శాండ్‌యానిమేటర్ మానస కుమార్ సాహు సైకత యానిమేటర్‌తో కళాత్మకంగా శుభాకాంక్షలు తెలిపాడు. దాదాపు 7 గంటల పాటు నిర్విరామంగా శ్రమించి, 1 నిమిషం 50 సెకన్ల నిడివితో యానిమేటెడ్ వీడియో చిత్రీకరించినట్లు తెలిపారు. ఉత్తమ ఒరిజినల్ పాటగా 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించడం మన జాతికి గర్వకారణమని అభినందించాడు. – భువనేశ్వర్

ముగిసిన అగ్ని గంగమ్మ యాత్ర


జయపురం: పూజలందుకుంటున్న అగ్ని గంగమ్మ


జయపురం: అమ్మవారి ఘటాలతో ప్రధాన పూజారులు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న నీలావడి అగ్ని గంగమ్మ అమ్మవారి జాతర బుధవారంతో ముగిసింది. గత తొమ్మిది రోజుల పాటు జరిగిన ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు ఉదయం అమ్మవారి ఘటాలను తీసుకొచ్చి మందిరంలో పెట్టడంతో ఉత్సవాలకు ముంగింపు పలికారు.

జయపురం: స్థానిక డెప్పిగుడలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న అగ్ని గంగమ్మ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం నుంచి ప్రారంభమైన ఘట జాతరలో ప్రధాన పూజారి ప్రత్యేక ఘటాలతో ముందు నడువగా, వెంట వందలామంది మహిళలు ఘటాలతో వెళ్లారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


జయపురం: ఘటాలు తీసుకెళ్తున్న మహిళలు


రాయగడ: అమ్మవారి ఘటాలను తీసుకొస్తున్న మహిళలు

బిల్లు లేకపోతే ప్రశ్నించే హక్కు ఉండదు


సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్

- మోసాలపై ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1967
- వినియోగదారుల దినోత్సవంలో పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో అందరూ వినియోగదారులేనని, ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలు గుర్తెరగాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పౌర సరఫరాలు, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు. బిల్లు లేకపోతే ప్రశ్నించే హక్కు ఉండదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మోసాలను అరికట్టేందుకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులతో వినియోగదారుల క్లబ్బులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఇందుకోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. ఇప్పటికే గ్రామీణ, మండలస్థాయిలో ఉన్న క్లబ్బులను మరింత పటిష్టం చేస్తామన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం 1967 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

• కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ఈ ఏడాది స్వచ్ఛమైన ఇంధన పరివర్తన ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం అనే నినాదంతో వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మొదటి దశగా 50 సచివాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేశామన్నారు.

• జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు రఘుపాత్రుని చిరంజీవి మాట్లాడుతూ శిలాజ ఇంధనాల వల్ల పర్యావరణం కలుషితమవుతోందని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన నీరు, గాలి, సూర్యరశ్మి, సముద్రతరంగాల శక్తి, భూతాప శక్తి, జీవశక్తిపై దృష్టి సారించాల్సిన అవసరం వచ్చిందని, ఈ ఏడాది నినాదం ఉద్దేశం ఇదేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యులు బగాది రామ్మోహన్‌రావు, జి.రాధారాణి, షణ్ముఖరావు, జిల్లా సరఫరాల అధికారి డి. వి. రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డా. డి.వి.విద్యాసాగర్, డీఈఓజి.పగడాలమ్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, ఇతర శాఖల అధికారులు, ఫోరం సభ్యులు, స్వచ్ఛంధ సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


శివ(ఫైల్)

నరసన్నపేట: స్థానిక బజారువీధిలో నివాసముంటున్న పాయకరావుపేటకు చెందిన దక్కుబల్లి శివ (35) అనుమానాస్పదంగా మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టడం వలన శివ మృతి చెందాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేట నుంచి నరసన్నపేటకు 15 ఏళ్ల క్రితం వలస వచ్చిన శివ తునికి చెందిన బంగారి సత్యవతితో సహజీవనం చేస్తూ బజారు వీధిలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 12న తీవ్ర గాయాలతో ఇంటికి రాగా సత్యవతి స్థానికుల సహాయంతో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించింది. పరిస్థితి విషమించడంతో ఈ నెల 13న శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కాగా, శివ స్నేహితులు మాత్రం ఇది హత్యేనని, కేసును దర్యాప్తు చేసి నిందితులను గుర్తించాలని కోరుతున్నారు. శివ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినా వారేవరూ రాలేదని, దీంతో సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వై.సింహాచలం తెలిపారు.

శ్రీముఖలింగంలో వాయిదా

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా పడినట్లు ఈఓ పి.ప్రభాకరరావు గురువారం తెలిపారు. వాస్తవంగా హుండీ లెక్కింపు శివరాత్రి ఉత్సవాల అనంతరం జరగాలి. సాంకేతిక కారణాలు వల్ల ఈ నెల 2న లెక్కిస్తామని చెప్పిన అధికారులు ఈ నెల 15 నాటికి వాయిదా వేశారు. తాజాగా మరోసారి వాయిదా వేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

తీరప్రాంతాల్లో వాచ్‌టవర్లు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- ప్రమాద స్థలాల్లో హెచ్చరిక బోర్డులు
- తీరప్రాంత భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తీర ప్రాంతంలో వాచ్ టవర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన చేసేందుకు సంబంధిత తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా స్థాయి తీరప్రాంత భద్రతా కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మంచినీళ్లపేట, రాజారాంపురం, మొగదాలపాడు, పీజీపేట, ఇందువానిపేట, బారువ, కొత్తఊరు తదితర ప్రాంతాల్లో వాచ్ టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రమాద స్థలాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు అవసరమైన నిధుల వివరాలు తెలియజేస్తే వాటిని జిల్లా నిధుల నుంచి మంజూరుచేస్తామని చెప్పారు. సముద్రతీర ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకోసం ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని సభ్యులు కోరగా మత్స్యశాఖలో ఈతగాళ్లు ఉంటారని, కావున వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సముద్రపు వేటకు వెళ్లే మత్స్యకారులు మత్స్యశాఖ జారీచేసే బయోమెట్రిక్ కార్డులు, ఆధార్ కార్డులు తీసుకువెళ్లడంలేదని తెలియజేయడంతో.. అటువంటి వారి నుంచి సాధారణ రుసుం వసూలుచేయాలని, తద్వారా కార్డులపై మత్స్యకారుల్లో అవగాహన కలుగుతుందన్నారు. మత్స్య శాఖ గుర్తింపు పొందని బోట్లు 11 మండలాల్లో 43 ఉన్నాయని, వాటికి రిజిస్ట్రేషన్ చేసుకుంటే నంబర్ కేటాయిస్తామని మత్స్య శాఖ ఉప సంచాలకులు తెలిపారు. వేటకు వెళ్లే వారిలో చిన్నపిల్లలు కూడా ఉంటున్నారని సభ్యులు తెలియజేయగా.. గ్రామప్రజల సహకారంతో సాగరిక సంస్థ ద్వారా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వారిని బడికి పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలర్ట్ ట్రాన్స్‌మీటర్స్ మత్స్యకారుల వద్ద లేనందున ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలియజేయగా.. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు, కలర్ కోడ్ తప్పనిసరి చేసినట్లు మెరైన్ పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.రాము, కస్టమ్స్ ప్రివెంటివ్ యూనిట్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, ఇండియన్ కోస్ట్ గార్డు అధికారి ఎస్.ఎం.బాషా, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్పీ జి.బి.ఆర్.మధుసూదనరావు, మెరైన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఐబీ జేడీడీ కె.గణేషన్, డీసీఐఓ పి.కె.మహాపాత్ర, మత్స్యశాఖ ఉపసంచాలకుడు పి.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి వనంగుడిలో వేద పండితులు శాస్త్రోక్తంగా బుధవారం చండీయాగాన్ని నిర్వహించారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ



దేశపాత్రునిపాలెం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ నిర్మలాదేవి

కొత్తవలస: గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న రికార్డులు పక్కాగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి డి.నిర్మలాదేవి సూచించారు. మండలంలోని దేశపాత్రునిపాలెం సచివాలయాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. పలు రకాల రికార్డులు, ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్న తీరును పరిశీలించారు. స్పందనకు వచ్చిన దరఖాస్తులకు ప్రత్యేక రికార్డు నిర్వహించాలని, పరిష్కార గడువు వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కృష్ణారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో శిక్షణ శిబిరం



స్పోర్ట్స్‌మీట్‌కు సిద్ధమైన ఏపీ పోలీస్ ఖోఖో జట్టు

విజయనగరం: ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 21 నుంచి జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే ఏపీ పోలీస్ ఖోఖో జట్టు శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. కొద్దిరోజులుగా నగరంలోని రాజీవ్ స్టేడియం, కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కోచ్ పీఎల్‌పీ కుమార్ నేతృత్వంలో జట్టు సభ్యులంతా శిక్షణ పొందారు. చివరిరోజు బుధవారం కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని కబడ్డీ, ఖోఖో పితామహుడు స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టారు విగ్రహానికి అంజలి ఘటించారు.

చిన్నారుల సంఖ్య పెరగాలి



అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి రమేష్

గజపతినగరం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరిగేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట-1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులు నలుగురే ఉండటంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. చిన్నారుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈ కేంద్రాన్ని సమీపంలోని మరో కేంద్రంలో విలీనం చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం సరుకుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుదర్శన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పులిదాడిలో ఆవుమృతి

మెంటాడ: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపంలో బుధవారం గజంగుడ్డివలస గ్రామానికి చెందిన రైతు బొబ్బాది బుదరయ్యకు చెందిన ఆవుపై పులి పంజా విసిరింది. కళ్లంలో కట్టిన ఆవును హతమార్చింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ మెంటాడ బీట్ అధికారి కె.వి.ఎస్.రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులిపాదముద్రలుగా నిర్ధారించారు. పులిదాడి చేసిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. స్థానికులను అప్రమత్తం చేసి, దండోరా వేయించారు.

అదుపు తప్పి ద్విచక్రవాహనం బోల్తా



ప్రమాదంలో గాయపడిన జగదీష్

కొత్తవలస: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో గాంధీనగర్ సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా గాజువాక సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన బలిరెడ్డి జగదీష్ తీవ్ర గాయాల పాలయాడు. క్షతగాత్రుడు తన అత్తవారి గ్రామం వేపాడ మండలం బొద్దాం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. జగదీష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి 108 వాహనంలో కొత్తవలస పీహెచ్‌సీకి తరలించగా ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం వైద్యులు విశాఖపట్నం రిఫర్ చేశారు.

యోనో యూజర్లు.. తస్మాత్ జాగ్రత్త

- ఎటువంటి మెసేజ్‌లకూ స్పందించవద్దు
- అకౌంట్ బ్లాక్ అవుతుందని సైబర్ నేరగాళ్ల సందేశాలు
- అప్‌డేట్ చేసుకోవాలంటూ పంపిస్తున్న లింకులు
- డీఎస్పీ ఎ.సుభాష్



ఎస్బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ ఎ.సుభాష్

పార్వతీపురంటౌన్: భారతీయ స్టేట్ బ్యాంక్ వినియోదారులపై సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ యోనో యాప్ వాడుతున్న వారిని టార్గెట్ చేస్తున్నారని వినియోదారులు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం డీఎస్పీ ఎ.సుభాష్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ రవిశంకర్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోనో విషయంలో వచ్చే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. 'ప్రియమైన ఎస్‌బీఐ వినియోదారు డా! మీ ఖాతా బ్లాక్ అవుతుంది. పాన్ నంబరును అప్‌డేట్ చేసుకోవడానికి ఈ కింద లింక్‌ను క్లిక్ చేయండి' అంటూ మోసపూరిత సందేశాలను పంపుతూ ఎస్బీఐ వినియోగదారులను సైబర్ మోసగాళ్లు టార్గెట్ చేస్తున్నారని వాటిని నమ్మవద్దని స్పష్టం చేశారు. ఇటువంటి సందేశాలు, ఈమెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు పంపే ఈ సందేశాల్లోని లింక్స్ ఓపెన్ చేస్తే ఖాతాలో డబ్బులు మాయమవుతాయని తెలిపారు. ఇటువంటి సందేశాలు వస్తే వెంటనే 'రిపోర్ట్.పిషింగ్ ఎట్ ఎస్‌బీఐ కో.ఇన్'లో రిపోర్ట్ చేయాలని ప్రజలకు సూచించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఖాతానంబర్, పాస్‌వర్డ్, ఓటీపీ సహా ఇతర సున్నిత, వ్యక్తిగత సమాచారాన్ని మెసేజ్ రూపంలో పంపవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు తమ లింక్స్ ద్వారా ఖాతాదారుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి మోసం చేస్తారని, ఏదైనా సైబర్ నేరం గురించి నేరుగా ఫిర్యాదు చేయాలంటే 1930 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చని సూచించారు.

17వతేదీ వరకు ఈపంట సామాజిక తనిఖీ

విజయనగరం ఫోర్ట్: రబీసీజన్ 2022-23లో జిల్లాలో 1,33,387 ఎకరాల్లో 85,835 మంది రైతులకు ఈ-పంట నమోదు చేశామని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,27,157 ఎకరాల్లో 79,395 మంది రైతులకు (95.6శాతం) ఈ-కేవైసీ పూర్తి చేశామని చెప్పారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ఈనెల 10వతేదీన ఈ -పంట ముసాయిదా జాబితాను పెట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్న రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి ఈ-పంట ముసాయిదా జాబితా ఈనెల 13 నుంచి 17 వతేదీ వరకు సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. అదేవిధంగా గ్రామ సభలు కూడా నిర్వహిస్తామని, గ్రామ సభల్లో ఆర్‌బీకే సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరాలను చదివి వినిపిస్తారన్నారు. కావున రైతులు రైతు భరోసా కేంద్రాల పరిధిలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించిన జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈ-పంట రబీ 2022-23 సీజన్ సవరణ కోసం ఇదే ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండవని స్పష్టం చేశారు.

140సారా ప్యాకెట్లతో మహిళ అరెస్టు

పాచిపెంట: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మహిళ సారా అమ్ముతూ బుధవారం పట్టుబడిందని ఎస్సై వెంకటరణ తెలిపారు. ఈ మేరకు ఆ మహిళ నుంచి 140 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వివాహిత అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తండ్రి

మెరకముడిదాం: తన కూతురు కనిపించడం లేదని, బుదరాయవలస గ్రామానికి చెందిన సరిధి రామస్వామినాయుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సరిధిగౌరి (43)ని బాడంగి మండలం రౌతోడువలస గ్రామానికి చెందిన రౌతుశ్రీనివాసరావుకు ఇచ్చి 23 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు తలెత్తుతుండడంతో వారి కుమారుడైన రౌతుదినేష్ తల్లిని తీసుకువచ్చి మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో తాత రామస్వామినాయుడు ఇంట్లో దిగబెట్టి వెళ్లిపోయాడు. అనంతరం సాయంత్రం 6గంటలకు గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లివస్తానని చెప్పి గౌరి వెళ్లి ఇంతవరకూ తిరిగి రాకపోవడంతో రామస్వామినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై నవీన్‌పడాల్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన్యంలో ఐదు నైపుణ్య శిక్షణ కేంద్రాలు

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఐదు నైపుణ్యశిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సాలూరు ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పార్వతీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్, సీతంపేట ఐటీఐలో నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ వివరాలను ప్రకటించారు.

- గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, సూయింగ్ మిషన్ ఆపరేటర్ కోర్స్‌లకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారు. ఈ కోర్సులకు 8వ తరగతి నుంచి డిగ్రీ చదువుకున్న అభ్యర్థులు అర్హులు. వివరాలకు సెల్: 63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలి.
- సాలూరు ప్రభుత్వ ఐటిఐలో ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన యువకులకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్స్‌లకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు సెల్: 94947 77553, 96662 00617 నంబర్లను సంప్రదించి కోర్సులలో చేరవచ్చు.
- సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్స్‌లకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎమ్‌కామ్ చదువుకున్న యువతీ, యువకులు అర్హులు. వివరాలకు సెల్: 85559 09899, 63051 10947 నంబర్లను సంప్రదించి కోర్సులో చేరవచ్చు.



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

- పార్వతీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రిటైల్ సేల్స్ అసోసియేషన్, మొబైల్ ఫోన్ అసెంబ్లింగ్ కోర్స్‌లకు శిక్షణ ఇస్తారు. స్వయ ఉపాధిని ప్రోత్సహిస్తారు. పదవ తరగతి, డిగ్రీ చదువుకున్న వారు అర్హులు. వివరాలకు సెల్: 93818 85611, 93917 42042 నంబర్లకు సంప్రదించాలి.
- సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్స్‌లను నిర్వహిస్తున్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో పూర్తిచేసిన యువకులు అర్హులు. వివరాలకు సెల్:70320 60773, 95024 07824 నంబర్లను సంప్రదించాలి.

పైడితల్లికి మార్వాడీల చల్లదనం



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న మార్వాడీలు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి మార్వాడీలు బుధవారం చల్లదనం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన పిండివంటలను నైవేద్యంగా సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మార్వాడీలు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొమరాడ: మండలంలోని గుణానుపురం గ్రామానికి చెందిన పాట్నూరు సతీష్ నిల్వ ఉంచిన 11 బస్తాల పీడీఎస్ బియ్యం బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారి హరి రమణరావు చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లో పీడీఎస్ రైస్ నిల్వలను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నిఘా పెంచామన్నారు పట్టుబడిన బియ్యం స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై 6ఎ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం జరగనున్న దృష్ట్యా జిల్లాలోని మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లెక్కింపు పూర్తి అయినంత వరకు మూసివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణకు కృషిచేయాలి

- ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మా పర్వీన్



ఎస్ఈబీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్వీన్

విజయనగరం క్రైమ్: నేరాల నియంత్రణకు అధికారులు కృషిచేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ అస్మా ఫర్వీన్ కోరారు. ఈ మేరకు విజయనగరం ఎస్ఈబీ స్టేషన్‌లో బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న రికార్డులు, వాహనాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్కిల్ పరిధిలో సారా, మద్యం అమ్మకాల నియంత్రణకు చేస్తున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయాలని సూచించారు. మహిళా పోలీసులతో స్టేషన్ ఆవరణలో మాట్లాడుతూ ఎస్ఈబీ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. వాహన తనిఖీల్లో భాగంగా విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. బుధవారం వేకువజామున ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సీఐ, సిబ్బంది వారిని ఆపి తనిఖీ చేశారు. వారి బ్యాగుల్లో 20 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యం కావడంతో ప్రశ్నించగా ఒడిశాలోని కొరాపుట్ జిల్లాకు చెందిన వారమని, డబ్బులు సంపాదించుకోవాలనే లక్ష్యంతో గంజాయిని తరలిస్తున్నామని పోలీసులకు తెలిపారు. అరెస్టయిన వారిలో కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితి బర్లి గ్రామానికి చెందిన ప్రమోద కుమార్ ఖోస్లా, అదే దమన్‌జోడికి చెందిన అవినాష్, తులసీ కులదీప్‌లు ఉన్నారు. సమావేశంలో వన్‌టౌన్ ఎస్సైలు రామ గణేష్, భాస్కరరావు, ఏఎస్సై మన్మథరావు, హెచ్‌సీ ఏవీ.రమణ పాల్గొన్నారు.

ఫోన్‌పే చేసినట్లు చూపించి పరారీ

విజయనగరం క్రైమ్: ఫోన్‌పే చేసినట్లు ఫేక్ మెసేజ్ చూపించి అమ్మకం దారు చెక్ చేసుకునే లోపు కొనుగోలు దారు పరారయ్యాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తన దగ్గరున్న మొబైల్ ఫోన్‌ను అమ్మేందుకు గుంకలాం గ్రామానికి చెందిన కృష్ణ ఓఎల్‌ఎక్స్‌లో రూ.లక్షా 10వేలకు సేల్ పెట్టాడు. విశాఖ నుంచి కొనుగోలు చేసేందుకు ఒక వ్యక్తి వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రూ.90వేలకు బేరం కుదుర్చుకున్నాడు. మొత్తం నగదు ఫోన్‌పే చేస్తానని చెప్పి మొబైల్ ఫోన్ తీసుకున్నాడు. ఫోన్‌పే చేసినట్లు అమ్మకం దారు కృష్ణకు ఫేక్ మెసేజ్ చూపించాడు. అయితే మొబైల్ విక్రయించిన కృష్ణ చెక్ చేసుకునే లోపు విశాఖ వాసి అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి ఖాతాలోకి డబ్బులు రాకపోవడంతో వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

శ్రమించింది- సాధించింది" నీట్‌లో అల్‌ఇండియా 3052

కొత్తవలస/వేపాడ: సరస్వతి కటాక్షానికి ధనిక, పేద తారతమ్యం ఉండదని నిరూపించాడు ఓ ఆటో డ్రైవర్ కుమారుడు. నీట్ పీజీ ఎంట్రన్స్‌లో జాతీయ స్థాయిలో 719 ర్యాంక్ సాధించి అందరు దృష్టిని ఆకర్షించాడు. కొత్తవలస మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు వంశీ ఇటీవల నిర్వహించిన నీట్ పీజీ ఎంట్రన్స్‌లో ఆలిండియా పరిధిలో 719వ ర్యాంక్ సాధించాడు. తండ్రి స్వామినాయుడు ఆటో నడుపుతూ కుంటుంబాన్ని పోషిస్తుండగా తల్లి అప్పలకొండ గృహిణి. కాగా గతంలో ఎంసెట్‌లో 688వ ర్యాంక్ సాధించి విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు వంశీ తెలిపాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు వంశీకి అభినందనలు తెలిపారు. అలాగే వేపాడ గ్రామానికి చెందిన ఆదపురెడ్డి మహాలక్ష్మి మాధురి నీట్ పీజీ సెట్‌లో ఆలిండియా 3052 ర్యాంకు సాధించింది.



నీట్ పీజీ సెట్‌లో 719వ ర్యాంక్ సాధించిన వంశీ



ఆదపురెడ్డి మహాలక్ష్మి మాధురి

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..



ఈశ్వర్ కౌశిక్‌ను కలిసిన నాగరాజు

విజయనగరం: క్రీడలు, క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. రేగిడి మండలం ఉణుకూరుకు చెందిన పర్వతారోహకుడు మెరుగుల నాగరాజు జిల్లా కేంద్రంలో ఈశ్వర్‌కౌశిక్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌశిక్ మాట్లాడుతూ, నాగరాజు గతంలో ఆఫ్రికా ఖండంలోని టాంజానియాలో 5,985 మీటర్ల ఎత్తు గల కిలిమంజారో పర్వతాన్ని కేవలం ఏడు రోజుల్లో అధిరోహించాడన్నారు. అలాగే సిక్కింలో 5,450 మీటర్ల ఎత్తు గల లఖోఖాన్సే పర్వతాన్ని అధిరోహించి, ఆ రాష్ట్ర ప్రభుత్వం బంగారు పతకంతో పాటు ఉత్తమ అధిరోహకుడు, ఉత్తమ మారథాన్ పురస్కారాన్ని కూడా అందుకున్నారన్నారు. ఎవరెస్ట్ అధిరోహణ లక్ష్యంగా చేసుకున్న నాగరాజుకు ఆర్థిక సాయంతో పాటు, అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

దూరమైన దాహం కేకలు..!

- ఏజెన్సీ గ్రామాలకు తాగునీటి సౌకర్యం
- వేసవి నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు
- గ్రామాల్లో విస్తృతంగా సర్వే
- పాడైన బోర్లు గుర్తించి మరమ్మతులు
- ముందస్తు చర్యలు చేపడుతున్న యంత్రాంగం



సీతంపేట: ఈ ఫొటోలో కనిపిస్తున్న బోరు సీతంపేట ఏజెన్సీలో కారిమానుగూడ గ్రామంలోనిది. ఇది మరమ్మతుల బారిన పడడంతో గిరిజనులు మంచి నీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న దాదాపు 20 కుటుంబాలకు తాగునీటి అవస్థలు తప్పలేదు. ఇది గుర్తించిన ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వెంటనే బోరు మరమ్మతు చేయడంతో నీరు



కారిమానుగూడలో బోరు రిపేరు చేస్తున్న సిబ్బంది

ఇప్పుడు పుష్కలంగా వస్తోంది. అలాగే ఇప్పమానుగూడలో రక్షిత పథకం పైప్‌లైన్ పాడవడంతో నీటి కోసం అవస్థలు అన్నీఇన్నీ కావు. అక్కడ కూడా 40కిపైగా గిరిజన కుటుంబాలు ఉంటాయి. ఇటీవల దానిని కూడా మరమ్మతు చేయడంతో గిరిజనుల నీటి కష్టాలు తీరాయి. ఇలా చెప్పుకుంటే చాలా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నారు. పులిగుమ్మి, అమ్మచెరువు, బంగారుగూడ తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి ఉండగా పరిష్కార చర్యలు తీసుకుంటున్నారు.

మార్చి నెల వచ్చిందంటే చాలు గ్రామాల్లో గుక్కెడు నీటి కోసం ఏటా తహతహలాడుతుంటారు. ఈ సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాల కాలంగా నీటి ఎద్దడితో గిరిజనులు అల్లాడుతున్నారు. కొండ శిఖర గ్రామాల్లో అయితే సమస్య జఠిలమైంది. ఈ కష్టాల నుంచి గట్టెక్కిండానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతోంది. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తనదైన శైలిలో అన్ని సమావేశాల్లోనూ, స్పందనలోనూ అధికారులకు సామాన్యుల వలే వినతులు ఇవ్వడంతో నీటి సమస్య కొలిక్కి వస్తోంది. నూతనంగా బోర్లు కూడా గ్రామాల్లో వేస్తున్నారు.



పులిగుమ్మిలో నూతన బోరు


గ్రామాల్లో విస్తృత సర్వే

గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేయడానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామాన్ని సందర్శించి అక్కడ బోర్లు రిపేరైతే వెంటనే చేయనున్నారు. పైప్‌లైన్ ఎక్స్‌టెన్షన్, బోర్‌వెల్ డ్రిల్లింగ్, చేతి పంపు రిపేర్లు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఐటీడీఏ పరిధిలో ట్రైబల్ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ పరిధిలో సీతంపేట, పాతపట్నం, కొత్తూరు, మందస, మెళియాపుట్టి, భామిని, హిరమండలం మండలాలున్నాయి. వీటిలో సీతంపేట ఏజెన్సీలో అత్యధికంగా 53 గిరిజన పంచాయతీల్లో 512 గ్రామలుండగా ప్రతి సంవత్సరం 50 వరకు గిరిజన గ్రామాలు తీవ్రనీటి ఎద్దడి ఎదుర్కొంటాయి. ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. రక్షిత మంచి నీటి పథకాలు 82, బోర్లు 704 ఉన్నాయి. వాటిలో 30కిపైగా బోర్లలో వర్షాకాలంలో మాత్రమే నీరు వస్తుంది. వేసవి వస్తే పనిచేయని పరిస్థితి. 20 వరకు నీటి ఎద్దడి గ్రామాలు గుర్తించినట్టుగ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తెలియజేస్తున్నారు.



ఇప్పగూడలో రక్షిత పథకం పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

క్షయ వ్యాధిపై అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో క్షయ వ్యాధి నివారణ ర్యాలీ బుధవారం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, నివారణపై టీబీ సూపర్‌వైజర్ ఎ.వీరాస్వామి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, కఫం ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సురేష్, గుర్ల పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

280 మందికి వైద్యసేవలు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామంలో శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ లిమిటెడ్ కార్మాగారం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 280 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు సన్యాసిరావు, శంకరరావు తెలిపారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.